సాక్షి
జనగామ
బుధవారం । 31 । జూలై । 2024



కళ్లముందే కొట్టుకుపోయారు..
పట్టణంలోని గీతానగర్‌కు చెందిన ఓ కుటుంబ సభ్యులు తీర్థయాత్రలో భాగంగా సరయూ నదిలో స్నానం చేస్తుండగా అకస్మాత్తుగా వచ్చిన వరదతో కొట్టుకుపోయారు.. - 10లో▸



ఆఫీస్ టు అగ్రికల్చర్
రైతులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా టీజీ ఎన్పీడీసీఎల్ ముందుకెళ్తుంది. విద్యుత్ అధికారులు రైతుల పొలం వద్దకే వెళ్లి సమస్యను పరిష్కరించనున్నారు. - 10లో▸

గరిష్టం/కనిష్టం
31°/25°
వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం మామూలు ఎండ. సాయంత్రం చల్లగాలులు వీస్తాయి.

రూ.180 కోట్లు

రెండో విడతలో జిల్లాలో మాఫీ అయిన రుణాలు

- రుణమాఫీని వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి
- కలెక్టరేట్‌లో భారీ స్క్రీన్ ఏర్పాటు
- అర్హులైన రైతులకు రుణమాఫీ
- కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రైతుల రుణాలను మాఫీ చేస్తుంది. ఇందులో భాగంగా మొదటి విడతలో 26,374 మంది రైతులకు రూ.149. 35 కోట్లు విడుదల చేయగా మంగళవారం రెండవ విడతలో 17,419 మంది రైతులకు రూ. 180 కోట్ల రుణమాఫీ చేసింది. ఈ మేరకు రెండో విడత రుణమాఫీ కార్యక్రమానికి సంబంధించి కలెక్టరేట్‌లోని సమావేశ హాల్‌లో జిల్లా వ్యవసాయాధికారి వినోద్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో అదనపు కలెక్టర్లు రోహిత్‌సింగ్, పింకేష్ కుమార్, జిల్లా ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్ రిజ్వాన్ బాషా పాల్గొన్నారు. ఆయా మండలాలకు చెందిన రుణమాఫీకి అర్హత కలిగిన 100 మంది రైతులను కలెక్టరేట్‌కు తీసుకు వచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యక్ష ప్రసారాన్ని తిలకించేందుకు సమావేశం హాల్‌లో భారీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 12.30 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి రెండవ విడత రుణమాఫీని వర్చువల్‌గా ప్రారంభించిన అనంతరం.. రైతులు సంబురాలు జరుపుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రెండు విడతల్లో 43,523 మంది రైతులకు రూ.330 కోట్ల మేర రుణమాఫీ జరిగినట్లు తెలిపారు. అనంతరం రూ.180 కోట్ల రెండో విడత రుణ మాఫీ చెక్కును కలెక్టర్ రైతులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కొమురయ్య, డీసీఓ రాజేందర్ రెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీధర్, బ్యాంకర్లు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



సీఎం ప్రసంగం వింటున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్లు రోహిత్‌సింగ్, పింకేష్‌కుమార్, రైతులు



చెక్కు అందిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

నిరీక్షణ ఫలించింది



అధికారంలోకి రాగానే రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. ఏడు నెలల నిరీక్షణ ఫలించింది. రెండో విడతలో రూ.1.42లక్షల మాఫీ వచ్చింది.

- కొడగాని కవిత, అప్పిరెడ్డిపల్లి

‘రుణ’ జాబితాలో బ్యాంకు పేరు మాయం

రైతు రుణమాఫీ జాబితాలో జిల్లా కేంద్రం సూర్యాపేట రోడ్డులోని యూనియన్ బ్యాంకు పేరు గల్లంతైంది. మొదటి, రెండు విడతల రుణమాఫీ జాబితాలో అర్హులైన రైతుల పేర్లు రాకపోవడంతో ఆందోళన నెలకొంది. ఈ విషయమై రైతులు బ్యాంకు అధికారులను నిలదీస్తుండగా.. సరైన సమాధానం రావడం లేదు. మొదటి దఫా పేర్లు మిస్ కావడంతో... రెండవ జాబితా కోసం ఎదురు చూసిన రైతులకు నిరాశనే ఎదురైంది. దీంతో పలువురు రైతులు మంగళవారం బ్యాంకుకు వెళ్లి మేనేజర్ పూర్ణచందర్‌తో రుణమాఫీలో పేర్ల గల్లంతు విషయమై అడిగారు.

మేమంతా అర్హతకు సరిపోమా..

జనగామ యూనియన్ బ్యాంకు బ్రాంచ్‌లో జనగామ, పాలకుర్తి, లింగాలఘణపురం, దేవరుప్పుల, రఘునాథపల్లి మండలాలకు చెందిన సుమారు 500 మందికిపైగా రైతులు పంట రుణాలు తీసుకున్నారు. ప్రభుత్వం ప్రకటించిన పంట రుణమాఫీకి 300 మంది అర్హత సాధించగా, రూ.3 కోట్లకు ఉంటుందని అంచనా. బ్యాంకుల వారీగా రుణ మాఫీ జాబితా వివరాలను తీసుకున్న సర్కారు, అర్హుల జాబితాను ప్రకటించే క్రమంలో ‘యూనియన్ బ్యాంకు’ పేరు గల్లంతు కావడం విస్మయానికి గురిచేస్తోంది. మూడు విడతల రుణమాఫీ పూర్తయిన తర్వాత, గల్లంతు జాబితాను పరిశీలిస్తామని ప్రభుత్వం చెప్పడంతో.. ఒకింత రైతులు కలవరపాటుకు గురవుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ వస్తే.. తమ పరిస్థితి ఏంటని, దీనిపై సమగ్ర విచారణ జరిపి మూడవ విడత జాబితా ప్రకటనలోపే పంట రుణమాఫీ చేయాలని కోరుతున్నారు.



బ్యాంకు మేనేజర్‌తో మాట్లాడుతున్న బాధిత రైతులు

పొరపాటు ఎక్కడ జరిగింది...

రుణమాఫీ జాబితాలో బ్యాంకు పేరు మిస్ కావడంలో తప్పు ఎక్కడ జరిగిందనే దానిపై అధికారులు కూపీ లాగుతున్నారు. డేటా ఎంట్రీ చేసే సమయంలో బ్యాంకు కోడ్ మరిచిపోయారా... సాంకేతిక సమస్యతో జాబితాలో నుంచి బ్యాంకు పేరు మాయమైందా అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మొదటి విడతలో అర్హత ఉన్న రైతుల పేర్లు రాని సమయంలో.. రెండవ విడత వరకు సరిచేయాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహించడం వెనక ఆంతర్యం ఏంటనే ప్రశ్న తలెత్తుతోంది. ఈ విషయం బ్యాంకు మేనేజర్ పూర్ణచందర్ మాట్లాడుతూ మొదటి, రెండవ విడతలో పంట రుణమాఫీకి సంబంధించి జరిగిన ఇబ్బందులపై ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు.

జాబితాలో పేరు రాలేదు..



2023, అక్టోబర్‌లో యూనియన్ బ్యాంకులో రూ.1.20 లక్షల రుణం తీసుకున్నా. మంగళవారం విడుదల చేసిన రెండవ విడత జాబితాలో పేరు రాలేదు. ఈ విషయమై బ్యాంకు అధికారులను అడిగితే ఉన్నతాధికారులకు సమాచారం అందించామన్నారు. న్యాయం జరిగేలా చూడాలి.

- చిర్ర సంపత్, కుందారం, లింగాలఘణపురం

317జీఓ టీచర్లకు స్థానచలనం కలిగేనా?

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2,930 అప్పీళ్లు
- స్థానికత, స్పౌజ్, మెడికల్, మ్యూచువల్‌గా వినతులు
- అత్యల్పంగా హనుమకొండ, అత్యధికంగా మహబూబాబాద్ జిల్లాలో దరఖాస్తులు

విద్యారణ్యపురి: గత ప్రభుత్వ హయాంలో 317 జీఓ ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న వివిధ కేడర్‌లలోని ఉపాధ్యాయులను ఆరు జిల్లాల్లో కేటాయించిన విషయం తెలిసిందే. స్థానికతను కోల్పోయామని, భార్య ఒక జిల్లాలో భర్త మరో జిల్లాలో, దూరప్రాంతాల జిల్లాకు కేటాయించారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఆందోళనలు సైతం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీరి సమస్య పరిష్కారానికి మంత్రివర్గ ఉపసంఘం కమిటీని ఏర్పాటు చేసింది. 317 జీఓ బాధితులు అప్పీల్ (దరఖాస్తు) చేసుకోవాలని ఇటీవల పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. దీంతో జిల్లాల వారీగా డీఈఓ కార్యాలయాల్లో అప్పీళ్లు స్వీకరించారు. అంతకుముందు ఆన్‌లైన్‌లోనూ స్వీకరించారు.

హనుమకొండ, వరంగల్ జిల్లాలకు కావాలని..

ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని హనుమకొండ, వరంగల్, ములుగు, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల్లో మొత్తం 2,930 అప్పీళ్లు వచ్చాయి. వీరి ధ్రువీకరణ పత్రాలను అధికారులు పరిశీలించారు. ఉదాహరణకు స్థానికత ఉంటే 1 నుంచి 7వ తరగతి వరకు బోనఫైడ్ స్టడీ సర్టిఫికెట్‌లు పరిశీలించారు. క్రానిక్ డిసీజెస్ వాస్తవమేనా కాదా అనేది మెడికల్ సర్టిఫికెట్లు, స్పౌజ్ కేటగిరీ అయితే స్పౌజ్ ఎక్కడ పనిచేస్తున్నారు అనేది చూశారు. మ్యూచువల్(పరస్పరం)గా కేటగిరీలో దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయుల ఇద్దరి కాన్సెంట్ లెటర్లు పరిశీలించారు. ఎక్కువ శాతం మంది తాము స్థానికత జిల్లాను కోల్పోయామని, ఆ స్థానికత ఆధారంగా ఆయా జిల్లాకు కేటాయించాలని అప్పీల్ చేశారు. హనుమకొండలో అతితక్కువగా దరఖాస్తులు రాగా మహబూబాబాద్ జిల్లాలో అత్యధికంగా వచ్చాయి. ములుగు, జయశంకర్‌భూపాలపల్లి, మహబూబాబాద్, జనగామ జిల్లాలకు చెందినవారు ఎక్కువశాతం మంది హనుమకొండ, వరంగల్ జిల్లాలకు బదిలీ చేయాలని, ఆ తరువాత ఇతర జిల్లాలను కోరుకున్నట్లు తెలుస్తోంది.



భూపాలపల్లిలో సగానికిపైగా ఇతర జిల్లాలకు వెళ్తామంటున్న ఉపాధ్యాయులు

జిల్లాల వారీగా అప్పీళ్లు ఇలా..

జిల్లా	అప్పీళ్లు	జిల్లా	అప్పీళ్లు
హనుమకొండ	38	జనగామ	527
వరంగల్	244	జేఎస్ భూపాలపల్లి	747
ములుగు	453	మహబూబాబాద్	921

కోరుకున్న చోటు దక్కేనా..

ఆయా జిల్లాల్లో వచ్చిన దరఖాస్తులు, ధ్రువపత్రాలను పరిశీలించిన డీఈఓలు వాటిని ఇటీవల పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్‌కు పంపారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆయా వివరాలను మంత్రివర్గ ఉపసంఘం కమిటీకి దృష్టికి తీసుకెళ్తారని భావిస్తున్నారు. దరఖాస్తుదారుల్లో ఇంతమందికి కోరుకున్న చోటికి అవకాశం లభిస్తుందనేది ప్రశ్నార్థకమేనని భావిస్తున్నారు. అత్యధిక సంఖ్యలో వివిధ జిల్లాల్లో నుంచి వేరేచోటికి బదిలీ చేయాలనేది వారిలో ఉంది. స్పౌజ్, మ్యూచువల్, మెడికల్ గ్రౌండ్ అప్పీళ్లను కొంత ముందుగా పరిష్కరిస్తారని భావిస్తున్నారు. స్థానికత ఆధారంగానే ఎక్కువ సంఖ్యలో అప్పీళ్లు వచ్చాయి. మొత్తంగా ఎంతమందికి స్థానచలనం కలుగుతుందనేది ఆసక్తికరంగానే మారింది.

ఆ జిల్లాలో సగం మందికిపైగా..

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రస్తుతం 1,408మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. వారిలో సగం మందికిపైగానే 747 మంది తమను వేరేచోటికి బదిలీ చేయాలని అప్పీల్ పెట్టుకున్నారు. అంతమందిని వేరేచోటికి బదిలీ చేస్తారా అన్న ప్రశ్న తలెత్తుతోంది. ఒకవేళ చేస్తే ఆ జిల్లా పాఠశాలల పరిస్థితి ఏమిటీ, మళ్లీ అక్కడికి ఎవరిని పంపుతారన్నది ప్రశ్నార్థకమే.

చర్చిని కూల్చడం దారుణం



కూల్చిన చర్చిని చూపుతున్న పాస్టర్లు, సంఘ పెద్దలు

స్టేషన్‌ఘన్‌పూర్: ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా చర్చిని కూల్చడం దారుణమని పాస్టర్లు, సంఘ పెద్దలు, సభ్యులు అన్నారు. మంగళవారం నమిలిగొండ శివారులో 175 సర్వేనంబర్‌లోని ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన ఫెయిత్‌హోం మినిస్ట్రీస్ చర్చిని రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. దీంతో విషయం తెలుసుకున్న పాస్టర్లు, సంఘ పెద్దలు, సంఘ సభ్యులు, క్రైస్తవులు అక్కడకు చేరుకుని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాస్టర్లు శ్యామ్‌సుందర్, ఫిలిప్, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గాదె శ్రీధర్, సంఘ సభ్యులు గాదె రాజు మాట్లాడారు. 2010లో రేకుల షెడ్ నిర్మాణం చేసుకుని ప్రార్థనలు చేస్తున్నామని, చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి ప్రార్థనలు చేస్తారన్నారు. సదరు స్థలాన్ని చర్చికి కేటాయించాలని గతంలో కలెక్టర్, అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించామన్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు. అలాగే ఈ విషయమై న్యాయం చేయాలని కోరుతూ బాధితులు, పాస్టర్లు ఆర్డీఓ డీఎస్ వెంకన్నకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు వెంకటస్వామి, ప్రభుచరణ్, పాల్, ప్రవీణ్, మాజీ ఉప సర్పంచ్ రవి, జినుక దిలీప్, రాజు, ప్రణయ్, కరుణాకర్, రాంచందర్, కనుకయ్య, వంశీ తదితరులు పాల్గొన్నారు. ఈ విషయమై ఆర్‌ఐ అర్జున్ మాట్లాడుతూ 175 సర్వేనంబర్‌లోని ప్రభుత్వ భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేస్తున్నారనే సమాచారం మేరకు తహసీల్దార్ ఆదేశాల మేరకు కూల్చి వేశామన్నారు.

కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

- బతుకమ్మకుంట, 2, 3 వార్డుల్లో పర్యటన
- శానిటేషన్ నిర్వహణపై ఆగ్రహం
- వన మహోత్సవంలో మొక్కలు నాటి సంరక్షించాలి
- కలెక్టర్ రిజ్వాన్ బాషా

సాక్షి ఎఫెక్ట్..

జనగామ: అధ్వాన్నంగా మారిన శానిటేషన్‌తో కంపు కొడుతున్న జనగామ పట్టణాన్ని స్వచ్ఛగా మార్చేందుకు కలెక్టర్ రిజ్వాన్ బాషా ప్రత్యేక దృష్టి సారించారు. మంగళవారం పట్టణంలోని బతుకమ్మకుంటతో పాటు 2, 3 తదితర వార్డుల్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్‌తో కలిసి ఆకస్మిక పర్యటనలు చేసి హడలెత్తించారు. ఇటీవల సాక్షిలో ‘ఎక్కడి చెత్త అక్కడే’, ‘బతుకమ్మకుంటలో భయం భయం’, ‘కంపుకొడుతున్న జనగామ’ అనే శీర్షికన వరుసగా ప్రచురితమైన కథనాలకు కలెక్టర్ స్పందించారు. అస్తవ్యస్తంగా మారిన శానిటేషన్ నిర్వహణలో అలసత్వంపై సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సారూ...దుర్వాసన భరించలేకపోతున్నామంటూ కాలనీల ప్రజలు కలెక్టర్‌తో మొరపెట్టుకున్నారు. కమిషనర్ వెంకటేశ్వర్లకు పరిపాలనపై పట్టులేకపోవడంతోనే శానిటేషన్ నిర్వహణ గాడి తప్పిపోతుందని కాలనీ ప్రజలు ఆరోపించారు.

సుందరంగా బతుకమ్మకుంట

బతుకమ్మకుంటను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. బతుకమ్మకుంటకు వచ్చే వాకర్లు, కుటుంబాలు, అన్ని వర్గాల ప్రజలకు ప్రశాంత వాతావరణం కలిగించేలా చూస్తామని కలెక్టర్ చెప్పారు. కుంటలో వీధి దీపాలు, వాకింగ్ ట్రాకర్ మరమ్మతు, పిచ్చి మొక్కల తొలగింపు, సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు నిరంతరం నిఘా ఉండేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు.



బతుకమ్మకుంటను పరిశీలిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా





‘సాక్షి’లో ఇటీవల ప్రచురితమైన కథనాలు

బతుకమ్మకుంటలో వనమహోత్సవం నిర్వహించి నాటిన ప్రతీ మొక్కను సంరక్షించుకునేందుకు ప్రతీఒక్కరిని భాగస్వామ్యం చేయాలన్నారు. బతుకమ్మ కమిటీ, వాకర్స్‌తో త్వరలో సమావేశం ఏర్పాటు చేయాలని కమిషనర్‌ను ఆదేశించారు. కలెక్టర్ వెంట కమిషనర్ వెంకటేశ్వర్లు, ఏఈ మహిపాల్, వార్డు కౌన్సిలర్లు అనిత, పగిడిపాటి సుధ, తదితరులు ఉన్నారు.

క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాలకు..

- జనగామ ఏసీపీ పార్థసారథి

జనగామ: నేటి తరం యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా క్రమశిక్షణ కలిగిన నడవడికతో ఉన్నత శిఖరాలకు చేరుకుని తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని జనగామ ఏసీపీ పార్థసారథి అన్నారు. మంగళవారం పట్టణంలోని వీవర్స్ కాలనీలో తెల్లవారు జాము 4.30 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు జనగామ పోలీసుల ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గుట్కా, మత్తుకు దూరంగా ఉండాలని, వీటికి సంబంధించి ఎక్కడైనా అమ్మకాలు జరిగితే తమకు వెంటనే సమాచారం అందించాలని, లేదంటే 100కు డయల్ చేస్తే సరిపోతుందన్నారు. నిషేధిత గుట్కాలు అమ్మినా, కొనుగోలు చేసినా నేరమన్నారు. ఆర్టీఏ నిబంధనలు పాటించని 15 ద్విచక్రవాహనాలు, రూ. 6 వేల విలువ చేసే మద్యం బాటిల్స్, ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యంతో పాటు ఒక ఆటోను సీజ్ చేశారు. కార్డన్ సెర్చ్‌లో సీఐ రఘుపతి రెడ్డి, ఎస్సైలు భరత్, చెన్న కేశవులు, కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసీపీ పార్థసారథి

పోస్టల్ బీమాను వినియోగించుకోవాలి

లింగాలఘణపురం: పోస్టాఫీసులో కల్పిస్తున్న బీమా పాలసీలను సద్వినియోగం చేసుకోవాలని జనగామ సబ్ డివిజన్ ఏఎస్పీ మదన్‌మోహన్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో తపాలా శాఖ ఆధ్వర్యంలో డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా తపాలా శాఖలోని పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మదన్ మోహన్ మాట్లాడుతూ సేవింగ్స్ అకౌంట్స్, ఇన్సూరెన్స్ పాలసీలతో పాటు బాలికల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సుకన్య సంవృద్ధి యోజన పథకంపై వివరించారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, తపాలా సిబ్బంది పాల్గొన్నారు.

దేవరుప్పులలో..

దేవరుప్పుల: తపాలా బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జనగామ ఈస్ట్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ రవి సూచించారు. మంగళవారం మండలంలోని మాధాపురంలో బ్రాంచి పోస్టుమాస్టర్ యాదయ్య అధ్యక్షతన డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇండియా పోస్టు పేమెంట్ బ్యాంకు సీనియర్ మేనేజర్ జైల్‌సింగ్, పంచాయతీ కార్యదర్శి యాకన్న, ఓవర్సీర్ చీమలపాటి భాస్కర్, పోస్టు మాస్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న మదన్‌మోహన్

విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంపొందించాలి

రఘునాథపల్లి: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేలా ఉపాధ్యాయులు బోధన చేయాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్ సూచించారు. ఎన్ఏఎస్ నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే ప్రోగ్రాంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో జరిగిన రఘునాథపల్లి కాంప్లెక్స్ ఉపాధ్యాయుల శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతీ విద్యార్థి విద్యా ప్రగతిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులకు పలు సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి రఘునందన్‌రెడ్డి, కాంప్లెక్స్ హెచ్‌ఎం సీహెచ్ ఉపేందర్, కార్యదర్శి యాకయ్య, ఆర్పీలు వి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నేడు డయల్ యువర్ డీఎం

జనగామ: జనగామ ఆర్టీసీ డిపో పరిధిలో నేడు (బుధవారం) డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని డీఎం స్వాతి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బచ్చన్నపేట, దేవరుప్పుల, లింగాలఘణపురం, నర్మెట్ట, తరిగొప్పుల, రఘునాథపల్లి, మద్దూరు, పాలకుర్తి మండలాల పరిధిలోని గ్రామాల ప్రజలు ఆర్టీసీ బస్సు సర్వీస్ సేవలు, సమస్యలు, సూచనలు, సలహాల తీసుకునేందుకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటలకు వరకు జరిగే డయల్ యువర్ డీఎం కోసం 9959226050 ఫోన్ నంబర్‌ను సంప్ర దించాలన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించాలి



బచ్చన్నపేట: రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తూ దానిని జాగ్రత్తగా వినియోగించుకుంటున్నారా లేదా అని పరిశీలించాలని ట్రాన్స్‌కో ఎస్ఈ వేణుమాధవ్ అన్నారు. మంగళవారం మండలంలోని బండనాగారం గ్రామంలో విద్యుత్ శాఖ- రైతు పొలం బాట కార్యక్రమంలో పాల్గొని లక్ష్మాపురం, బండనాగారం గ్రామ రైతుల వ్యవసాయ క్షేత్రాల్లో కరెంటు స్తంభాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడానికి ప్రత్యేక ఫీడర్లను ఏర్పాటు చేశామన్నారు. విద్యుత్ వినియోగంలో ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా అధికారులను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ లక్ష్మీనారాయణరెడ్డి, ఏడీఈ వేణుగోపాల్, ఏఈ రాజ్‌కుమార్, సబ్ ఇంజనీర్ దీనయ్య, లైన్ ఇన్‌స్పెక్టర్ నర్సింహ్మారెడ్డి, లైన్‌మెన్ శివ, ఏఎల్ఎం పరశురాం, జేఎల్ఎం అంజనేయులు, కట్టర్ రైతులు పలువురు పాల్గొన్నారు.

పలువురు కానిస్టేబుళ్ల బదిలీ

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పలువురు కానిస్టేబుళ్లు, ఇద్దరు ఏఎస్సైలను బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కానిస్టేబుళ్లు కె.రవీందర్‌రెడ్డి ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్ నుంచి కొడకండ్ల, జి.నరేందర్ మిల్స్‌కాలనీ నుంచి తరిగొప్పుల, బి.శివకృష్ణ ఇంతేజార్‌గంజ్ నుంచి బచ్చన్నపేట, ఎం.కుమారస్వామి సుబేదారి నుంచి రాయపర్తి, ఎం.కుమారస్వామి సుబేదారి మహిళా పోలీస్ స్టేషన్ నుంచి దేవరుప్పుల, డి.సంపత్ ధర్మసాగర్ నుంచి తరిగొప్పుల, జె.మధుసూదన్ ధర్మసాగర్ నుంచి రాయపర్తి, ఎ.వెంకటస్వామి మడికొండ నుంచి కొడకండ్ల, టి.సురేశ్ నల్లబెల్లి నుంచి తరిగొప్పుల, బి.శ్యాం నల్లబెల్లి నుంచి రాయపర్తి, వి.రాజు పర్వతగిరి నుంచి బచ్చన్నపేట, ఎస్.రాకేశ్ నెక్కొండ నుంచి కొడకండ్లకు బదిలీ అయ్యారు. అదేవిధంగా ఏఎస్సైలు వై.కాసులు సుబేదారి మహిళా పోలీస్ స్టేషన్ నుంచి జనగామ, కె.రాజయ్య సుబేదారి నుంచి తరిగొప్పుల పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

‘విజ్ఞాన్ మంథన్’కు దరఖాస్తు చేసుకోవాలి

జనగామ రూరల్: విజ్ఞాన భారతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎస్‌సీఈఆర్‌టీ సౌజన్యంతో నిర్వహించే విద్యార్థి విజ్ఞాన్ మంథన్ ఆన్‌లైన్ పరీక్షకు ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఏఎంఓ శ్రీనివాస్, జిల్లా కోఆర్డినేటర్ బాలరాజులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 23, 27న దేశ వ్యాప్తంగా పరీక్ష నిర్వహించనున్నారని, అక్టోబర్ 15లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఫైర్‌వర్క్స్ దుకాణంలో పోలీసుల దాడులు



జనగామ: సిద్దిపేట ప్రధాన రహదారి ఓబుల్‌కేశ్వాపూర్ శివారులోని అనుగ్రహ ఫైర్ వర్క్స్ దుకాణంపై టాస్క్‌ఫోర్స్, పోలీసులు కలిసి మంగళవారం దాడులు చేశారు. సీఐ రఘుపతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పక్కా సమాచారం మేరకు ఎస్సై రాజేష్ కుమార్, కానిస్టేబుళ్లు భాస్కర్, జితేందర్ ఆధ్వర్యంలో దారం సత్యనారాయణకు చెందిన అనుగ్రహ ఫైర్ వర్క్స్ షాప్‌లో ఎటువంటి అనుమతులులేకుండా, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా నాలుగు ఐరన్ కంటైయినర్లలో భద్రపరిచిన క్రాకర్స్‌ను పట్టుకున్నారు. వీటి విలువల రూ.22.93 లక్షల వరకు ఉంటుందన్నారు. క్రాకర్స్‌ను సీజ్ చేసి, యజమాని సత్యనారాయణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

క్లుప్తంగా

'ముగ్గురు దళ సభ్యులను కోర్టులో హాజరు పర్చాలి'

ఏటూరునాగారం: ఏటూరునాగారం–మహదేవపూర్ దళంలోని నిరాయుధులైన ముగ్గురు సభ్యులను అరెస్ట్ చేసి ఎన్‌కౌంటర్ చేసే ప్రయత్నాలు చేస్తున్నారని, వారిని వెంటనే కోర్టులో హాజరు పర్చాలని జేఎండబ్ల్యూపీ డివిజన్ కమిటీ కార్యదర్శి వెంకటేష్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈనెల 29వ తేదీన నిరాయుధులైన దళ సభ్యులు జైసింగ్, రమేశ్‌ను, మంగళవారం సుక్కిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. వారిని ఆచూకీ తెలియకుండా దాచిపెట్టి చిత్రహింసలకు గురిచేస్తూ ఎన్‌కౌంటర్ పేరుతో చంపే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. దళ సభ్యులకు ఎలాంటి హాని జరిగినా కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక నాయకులే బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు, ప్రజాస్వామికవాదులు ఈ అక్రమ అరెస్ట్‌లను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.

లాజిస్టిక్ ఏజెంట్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

హన్మకొండ: టీజీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్ ఏజెంట్ల నియామకానికి ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని వరంగల్, ఖమ్మం రీజియన్ల స్థాయి లాజిస్టిక్ అధికారి పవన్ కుమార్ తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో వివిధ ప్రాంతాల్లో లాజిస్టిక్ పాయింట్స్ ఏర్పాటుకు టీజీఎస్ ఆర్టీసీ నిర్ణయం తీసుకుందని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్టీసీ ప్రయాణికుల రవాణాతో పాటు, పార్సిల్, కొరియర్ సేవలు అందిస్తోందని తెలిపారు. ఈ సేవలు వినియోగదారుల ముంగిటకు తీసుకెళ్లడానికి ఏజెంట్ల నియామకానికి యాజమాన్యం అనుమతి ఇచ్చిందన్నారు. ఆసక్తి కలిగిన వారు ఏరియా ఆర్టీసీ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లను సంప్రదించాలని కోరారు. వరంగల్, ఖమ్మం జిల్లాల లాజిస్టిక్ అధికారి పవన్ కుమార్ (8125458546), ఎగ్జిక్యూటివ్‌లు ఎస్.రామయ్య (9154298759), సతీశ్ కుమార్ (9154298761), నరేందర్ (9154298763), శ్రవణ్ కుమార్ (9154298760) హనుమకొండ, వరంగల్, కాజీపేటలో కార్గో పాయింట్ల ఏర్పాటు వివరాలు తెలుపుతారని వివరించారు. పరకాల – భూపాలపల్లి ప్రాంత వాసులు ప్రశాంత్ కుమార్ (9154298764), మహబూబాబాద్ ప్రాంత వాసులు వేలాద్రి (9154298768), తొర్రూరు ప్రాంత వాసులు చైతన్యకుమార్ (9154298766), జనగామ ప్రాంతవాసులు అవినాశ్ (9154298762), నర్సంపేట వాసులు నరేందర్ (9154298763)ను సంప్రదించాలని సూచించారు.

మేడిగడ్డకు మళ్లీ వరద

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి మేడిగడ్డ(లక్ష్మి) బరాజ్‌కు మళ్లీ వరద ప్రవాహం పెరుగుతోంది. మంగళవారం మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాల కారణంగా ప్రాణహిత నది పరవళ్లు తొక్కుతోంది. దీంతో కాళేశ్వరం వద్ద సాయంత్రం 11.040 మీటర్ల ఎత్తులో నీటిమట్టం ప్రవహిస్తోంది. వరదనీరు దిగువన మేడిగడ్డ(లక్ష్మి)బరాజ్ వద్ద 7,71,580 క్యూసెక్కుల వరద తరలి వస్తోంది. మొత్తం 85 గేట్లు ఎత్తి నీటిని దిగువకు తరలిస్తున్నారు. కాగా, అన్నారం బరాజ్ వద్ద 7 వేల క్యూసెక్కుల వరద తరలి వస్తోంది. బరాజ్‌లోని 66 గేట్లు ఎత్తి నీటిని దిగువకు తరలిస్తున్నారు.

ఆఫీస్ టు అగ్రికల్చర్..


జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం లక్ష్మాపూర్‌లో పొలం బాటలో పాల్గొన్న ఎన్పీడీసీఎల్ అధికారులు, రైతులు


వరంగల్ జిల్లా గీసుకొండ మండలం మనుగొండలో పొలంబాటలో ఎన్పీడీసీఎల్ అధికారులు, రైతులకు కెపాసిటర్లు అందజేస్తున్న వరంగల్ ఎస్ఈ మధుసూదన్

విద్యుత్ అధికారుల పొలం బాట..
- రైతుల ముంగిట టీజీ ఎన్పీడీసీఎల్ సేవలు
- క్షేత్ర స్థాయిలో సమస్యలు తెలుసుకుని సత్వరమే పరిష్కారం
- వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు వినూత్న కార్యక్రమాలు

హన్మకొండ : రైతులకు శుభవార్త.. ఇక నుంచి తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ అధికారులు, కార్యాలయాలు తిరగాల్సిన అవసరం లేదు. రోజులకు రోజులు తిరిగినా సమస్య పరిష్కారం కావడం లేదని చింతించాల్సిన పని లేదు. సమస్యలు తెలుసుకోవడానికి అధికారులే నేరుగా పొలం వద్దకు వస్తారు. రైతులను కలిసి సమస్యను తెలుసుకుని సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తారు. రైతులకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందించడమే ధ్యేయంగా టీజీ ఎన్పీడీసీఎల్ వినూత్న కార్యక్రమాలతో ముందుకెళ్తోంది. ఇందులో భాగంగా క్షేత్ర స్థాయిలో సమస్యలు గుర్తించి వాటిని సత్వరమే పరిష్కరించడానికి రైతుల ముంగిటికే విద్యుత్ సేవలు తీసుకెళ్తోంది. ఇప్పటి వరకు రైతులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అధికారులు, విద్యుత్ కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగేవారు. అయినా పనులు కాని సందర్భాలు కోకొల్లలు. నెలలు, సంవత్సరాలు గడిచినా పరిష్కారానికి నోచుకోకుండా మిగిలిన సమస్యలున్నాయి. ఫలితంగా అధికారుల చుట్టూ తిరిగి వేసారి విసుగు చెందిన రైతులు తమ పనులు వదిలేసిన ఘటనలు ఉన్నాయి.

ఇప్పటి నుంచి రైతులకు నిరీక్షణ ఉండదు

ఇప్పటి నుంచి రైతులకు నిరీక్షణ, విసుగు చెందడం ఉండదు. కార్యాలయాల చుట్టూ తిరుగుడూ తప్పుతుంది. దీనికి కారణం విద్యుత్ అధికారులు పొలం బాట పట్టడమే. రైతులకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందించేందుకు టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం కొత్తగా పొలం బాట కార్యక్రమాన్ని చేపట్టింది. ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని రూపకల్పన చేశారు.

విద్యుత్ అధికారులు నేరుగా పొలాల వద్దకు..

పొలం బాటలో భాగంగా విద్యుత్ అధికారులు నేరుగా పొలాల వద్దకు చేరుకుని రైతులను కలుస్తారు. ఎన్పీడీసీఎల్ జిల్లా స్థాయి అధికారి సూపరింటెండెంట్ ఇంజనీర్ మొదలు.. డివిజనల్ ఇంజనీర్లు, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్‌లు, సెక్షన్‌కు చెందిన అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ)లు, విద్యుత్ సిబ్బంది మొత్తం క్షేత్ర స్థాయిలో పర్యటిస్తారు. రైతులను కలిసి విద్యుత్ పరంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుంటారు. విద్యుత్ సరఫరాలో ఉన్న ఇబ్బందులు, లోఓల్టేజీ, హైఓల్టేజీ విద్యుత్ సరఫరా, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్‌పై పడుతున్న భారం, తరచూ మరమ్మతులు వస్తున్నాయా? తరచూ కాలిపోతుందా? కాలిపోయిన వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ మారుస్తున్నారా? అదనపు ట్రాన్స్‌ఫార్మర్ అవసరమా? ఒరిగిన విద్యుత్ స్తంభాలు, లూజ్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్‌లకు ఏబీ స్విచ్ ఉన్నాయా? ట్రాన్స్‌ఫార్మర్‌ల గద్దెలు ఎత్తు తక్కువగా ఉండి ప్రమాదకరంగా ఉన్నాయా? వంటి సమస్యలు తెలుసుకుంటారు. రైతులు చెప్పిన సమస్యలు నమోదు చేసుకుని వాటిని సాధ్యమైన మేరకు త్వరగా పరిష్కరిస్తారు. అదే విధంగా రైతులకు విద్యుత్‌తో జరిగే ప్రమాదాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తారు. పంట పొలాల చుట్టూ విద్యుత్ కంచెలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా జరిగే ప్రమాదాలపై వివరిస్తారు. మోటార్లకు ఎర్తింగ్ ఏర్పాటు చేసుకోవడం, కెపాసిటర్లు అమర్చుకోవడం, అతుకులులేని సర్వీస్ వైర్ వినియోగంపై అవగాహన కల్పిస్తారు. రైతులు సొంతంగా ఫ్యూజ్ వైర్ మారిస్తే జరిగే నష్టం.. ప్రమాదంపై వివరిస్తారు. విద్యుత్ ప్రమాదాలు ఏఏ సందర్భాల్లో జరుగుతాయో రైతులకు విడమరిచి చెబుతారు. ఇలాంటి సేవలు అందించడం ద్వారా రైతులకు విద్యుత్ అధికారులు, సిబ్బందిపై నమ్మకం కలుగుతుందని, విద్యుత్ సంస్థ, రైతులకు మేలు జరుగుతుందని, రైతులతో సత్సంబంధాలు ఏర్పడుతాయని ఎన్పీడీసీఎల్ యాజమాన్యం ఆశిస్తోంది.

ప్రధాని మోదీ వైఖరి మారడం లేదు

- బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి


వరంగల్ చౌరస్తా : మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్ రెడ్డి

వరంగల్ చౌరస్తా : దేశంలో మెజారిటీ ప్రజలు లోక్‌సభ ఎన్నికల్లో గుణపాఠం చెప్పినా ప్రధానమంత్రి మోదీ వైఖరిలో ఎలాంటి మార్పు రాలేదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి విమర్శించారు. మంగళవారం వరంగల్ హంటర్ రోడ్‌లోని పీఆర్‌ఆర్ హాల్‌లో సీపీఐ ఖిలా వరంగల్ మండల స్థాయి రాజకీయ శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. ఓర్సు రాజు అధ్యక్షతన జరిగిన శిక్షణ తరగతుల ప్రారంభ కార్యక్రమానికి చాడ వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ పాత పద్ధతులనే అవలంబిస్తూ నిరంకుశ విధానాలే అనుసరిస్తున్నారన్నారు. ఇండియా కూటమిలో ఉన్న రాష్ట్రాలకు కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా వివక్షకు పాల్పడడం ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచిది కాదని పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణపై వివక్ష ప్రదర్శించారని తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి మేకల రవి, జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్‌కే బాషుమియా, పనస ప్రసాద్, సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పంజాల రమేశ్, మండల కార్యదర్శి దండు లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ కుంభకోణంపై విచారణ చేపట్టాలి..

న్యూశాయంపేట: జీఎస్‌టీ కుంభకోణంపై పూర్తి స్థాయి విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన హనుమకొండలో విలేకరులతో మాట్లాడారు. మాజీ సీఎస్ సోమేశ్‌కుమార్.. కేసీఆర్‌కు పెద్దకొడుకులాంటి వాడని, అవినీతి, అక్రమాల్లో ఆయన హస్తం ఉందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ ద్వారా అంతులేని అక్రమాలు జరిగాయన్నారు. భూప్రక్షాళన జరగాలంటే ముందు రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన జరగాలని, సర్వేనంబర్ వారీగా సమగ్రంగా సర్వే చేపట్టాలన్నారు. సీపీఐ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాలు వచ్చే నెల 22, 23, 24 తేదీల్లో హనుమకొండలో నిర్వహించనున్నట్లు తెలిపారు. శ్రీనివాస్ రావు, జ్యోతి, కరుణాకర్, ఎల్లేశ్, లింగారెడ్డి, అశోక్ స్టాలిన్, లక్ష్మణ్, సంతోష్, రవి ఉన్నారు.

కళాకారుల కష్టాలు ముఖ్యమంత్రికి వివరిస్తా

- కేంద్ర ఖాదీ చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం


మాట్లాడుతున్న ఈగ మల్లేశం

హన్మకొండ కల్చరల్ : కళాకారుల కష్టాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వివరిస్తానని, వారికి తగిన న్యాయం జరిగేలా చూస్తానని కేంద్ర ఖాదీ చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం హామీ ఇచ్చారు. సురభి 140వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని భానోదయ నాట్యమండలి ఆధ్వర్యంలో ఆరో రోజు మంగళవారం ప్రదర్శించిన రావణబ్రహ్మ నాటకం అలరించింది. హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో జరిగిన ప్రదర్శనలో ఈగ మల్లేశం ముఖ్యఅతిథిగా పాల్గొని సురభి కళాకారులకు రూ. 10 వేల ఆర్థిక సాయం చేశారు. తెలంగాణ డ్రమెటిక్ అసోసియేషన్ ప్రచార కార్యదర్శి నిమ్మల శ్రీనివాస్, సీనియర్ కళాకారులు కళా రాజేశ్వర్‌రావు, రేకందర్ నాగబాబు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న సురభినాటకోత్సవాలు..

వారం రోజులుగా నిర్వహిస్తున్న సురభి నాటకోత్సవాలు బుధవారం ముగియనున్నాయి. చివరి రోజు శ్రీవీరబ్రహ్మంగారి చరిత్ర ప్రదర్శించనున్నట్లు నాట్య మండలి అధ్యక్షుడు ఆర్.నాగబాబు తెలిపారు. కళాపోషకులు అధిక సంఖ్యలో హాజరుకాలన్నారు.

ప్రమాదరహిత డ్రైవర్లను స్ఫూర్తిగా తీసుకోవాలి

- పొరపాట్లు సరిదిద్దుకోవాలి
- వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా


ప్రమాదరహిత డ్రైవర్లను సన్మానిస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా, ఆర్టీసీ ఆర్ఎం విజయభాను

హన్మకొండ: ప్రమాదరహిత డ్రైవర్లను స్ఫూర్తిగా తీసుకోవాలని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా సూచించారు. మంగళవారం హనుమకొండలోని వరంగల్–1 డిపోలో వరంగల్ రీజియన్ స్థాయి ప్రమాదరహిత వారోత్సవాల ముగింపు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఇప్పటి వరకు ఎలాంటి ప్రమాదాలు చేయకుండా సురక్షితంగా బస్సు నడిపిన సీనియర్ డ్రైవర్లను ఎంపిక చేసి సన్మానించారు. రీజియన్ స్థాయిలో ముగ్గురు, డిపో స్థాయిలో ముగ్గురు చొప్పున ఎంపిక చేసిన డ్రైవర్లను పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా సన్మానించి ప్రశంస పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 ఏళ్లకు పైగా డ్రైవర్‌గా కొనసాగుతూ యాక్సిడెంట్ చేయకపోవడం అభినందనీయమన్నారు. ఈ డ్రైవర్లు స్ఫూర్తి ప్రధాతలన్నారు. వారి నుంచి ఇతర డ్రైవర్లు బస్సు ఎలా నడపాలో నేర్చుకోవాలన్నారు. చిన్న పొరపాట్లు ఉంటే సరి చేసుకోవాలని సూచించారు. ప్రతి బస్సు డ్రైవర్ తన వెనుక 50 మంది ప్రయాణికుల ప్రాణాలుంటాయని మరవొద్దన్నారు. బాధ్యత, అప్రమత్తతతో డ్రైవింగ్ చేయాలన్నారు. ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను మాట్లాడుతూ గతేడాది కంటే ఈ ఏడాది ప్రమాదాలు తగ్గాయన్నారు. ప్రమాదాలు 0.11 నుంచి 0.09 శాతానికి తగ్గాయన్నారు. కండక్టర్లు, డ్రైవర్లు ప్రయాణికుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ మేనేజర్లు కేశరాజు భానుకిరణ్, మాధవ రావు, డిపో మేనేజర్లు వంగల మోహన్ రావు, లక్ష్మీప్రసన్న, పద్మావతి, రవిచందర్, శివప్రసాద్, స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఇద్దరికి 20 ఏళ్ల చొప్పున జైలు

- రూ.లక్ష చొప్పున జరిమానా
- తీర్పు వెలువరించి జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పనుపులేటి చంద్రశేఖర ప్రసాద్
- ట్రాక్టర్ తొట్టికింది భాగంలో అరల ఏర్పాటు.. వాటిలో గంజాయి ప్యాకెట్లు


ట్రాక్టర్ డబ్బా అడుగు భాగంలో గంజాయి ప్యాకెట్లు (ఫైల్)

మహబూబాబాద్ రూరల్: పుష్ప సినిమా తరహాలో ట్రాక్టర్ తొట్టికింది భాగంలో అరలు ఏర్పాటుచేసి గంజాయి తరలించారు.. పోలీసులకు పట్టుబడి కటకటాలపాలయ్యారు. నిందితులపై నేరం నిరూపణ కావడంతో ఇద్దరికి 20 ఏళ్ల చొప్పున జైలుశిక్ష, రూ.లక్ష చొప్పున జరిమానా విధిస్తూ మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పనుపులేటి చంద్రశేఖరప్రసాద్ మంగళవారం తీర్పు వెలువరించారు.కోర్టు డ్యూటీ అధికారి హన్మకొండ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. డోర్నకల్ మండల కేంద్రంలో గల బాబుజగ్జీవన్‌రాం విగ్రహం వద్ద 2021, అక్టోబర్ 31వ తేదీన అప్పటి ఎస్సై భద్రునాయక్, కానిస్టేబుళ్లు దస్తగిరి, సైదులు వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఓ ట్రాక్టర్ అనుమానాస్పదంగా రావడాన్ని గమనించి ఆ వాహనాన్ని ఆపి తనిఖీలు నిర్వహించారు. ట్రాక్టర్ ఇంజన్ వెనుక ఉన్న డబ్బా అడుగు భాగంలో అరలు ఏర్పాటుచేసి అందులో 150 ప్యాకెట్లలో సుమారు రూ. 30 లక్షల విలువల గల 300 కిలోల (30 క్వింటాళ్లు) ఎండు గంజాయిని దాచారు. దానిని స్వాధీనం చేసుకుని మరిపెడ మండలం తండ ధర్మారానికి చెందిన బానోత్ కిరణ్‌కుమార్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని సుజాతానగర్ మండలం కొయ్యగూడెం గ్రామానికి చెందిన బాధావత్ సూర్యను నిందితులుగా పేర్కొంటూ ఎస్సై భద్రునాయక్ ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐ ఇస్లావత్ శ్రీనివాస్‌నాయక్ కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిలుకమారి వెంకటేశ్వర్లు కోర్టులో వాదనలు వినిపించారు. డీఎస్పీ తిరుపతిరావు ప్రస్తుత డోర్నకల్ సీఐ బి.ఉపేందర్‌రావు ఆధ్వర్యంలో సీడీఓ నవీన్‌కుమార్ ఆరుగురు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. వాదనలు విన్న జిల్లా జడ్జి చంద్రశేఖరప్రసాద్ నేరం నిరూపణ కావడంతో నేరస్తులకు ఒక్కొక్కరికి 20 ఏళ్ల చొప్పున కఠిన కారాగార శిక్ష, ఒక్కొక్కరికి రూ. లక్ష చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. జరిమానా కట్టనిపక్షంలో మరో 6 నెలల చొప్పున జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

నీటి కోసం వెళ్లి మృత్యుఒడికి..

- బావిలో పడి యువ రైతు మృతి


ప్రణయ్ (ఫైల్)

ఆత్మకూరు : దాహం వేయడంతో నీటి కోసం వ్యవసాయ బావి వద్దకు వెళ్లిన ఓ యువ రైతు.. అందులో పడి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని అక్కంపేటలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సిలువేరు ప్రణయ్ (30) ఈనెల 28వ తేదీన తమ వ్యవసాయ భూమి వద్ద పనిచేస్తూ దాహం వేయడంతో సమీపంలో ఉన్న ముస్కు మల్లయ్య బావి వద్దకు వెళ్లాడు. నీరు తాగుతుండగా కాలుజారి బావిలో పడి మృతి చెందాడు. వ్యవసాయ భూమి వద్దకు వెళ్తానని చెప్పిన ప్రణయ్ ఎంతకూ ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ముస్కు మల్లయ్య బావిలో ప్రణయ్ మృతదేహం లభించింది. దాహం కోసమే వెళ్లి తన కుమారుడు మృతి చెందాడని మృతుడి తండ్రి బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్ మంగళవారం తెలిపారు.

కొనసాగుతున్న విచారణ!

- పోలీస్‌స్టేషన్‌కు విద్యార్థుల ఆన్సర్ బుక్ లెట్లు
- 61 మంది స్టూడెంట్ల ఫలితాల నిలిపివేత
- ఆన్సర్ బుక్ లెట్లను మార్చిన ఘటనలో తొలుత 11మంది దినసరి కూలీల అరెస్ట్
- ఆ తర్వాత మరో 8 మంది కూడా..

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని పరీక్షల విభాగంలో విధులు నిర్వర్తించే దినసరి వేతన కూలీలు.. విద్యార్థులు రాసిన ఆన్సర్‌బుక్‌లెట్లను తీసి మళ్లీ వారితో రాయించి గుట్టుచప్పుడు కాకుండా జవాబు పత్రాలు బండిల్స్‌లో పెడుతున్న ఘటన ఈఏడాది మేలో వెలుగు చూసిన విషయం విధితమే. డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల ఆరో సెమిస్టర్ పరీక్షలు జరిగాక సుమారు 61మంది విద్యార్థులు తమ ఆన్సర్ బుక్‌లెట్లను మార్చుకున్నారనేది ప్రాథమికంగా గుర్తించారు. ఈ ఘటనలో పరీక్షల విభాగంలో పనిచేస్తున్న దినసరి కూలీల్లో తొలుత 11మందిని, అనంతరం మరో 8 మందిని అరెస్ట్ చేయగా వారు బెయిల్‌పై బయటకు వచ్చారు. ఈ ఘటనపై విచారణ కొనసాగుతోంది. ఈ క్రమంలో కేయూ సీఐ సంజీవ.. సదరు విద్యార్థుల ఆన్సర్ బుక్‌లెట్లను పంపాలని పరీక్షల విభాగం అధికారులకు ఇటీవల లేఖ పంపారు. దీంతో 59 మంది విద్యార్థుల ఆన్సర్ బుక్‌లెట్లను కేయూ పోలీస్‌స్టేషన్‌కు పంపారు. ఈ విషయాన్ని పరీక్షల నియంత్రణాధికారి నర్సింహాచారి ధ్రువీకరించారు.

విద్యార్థులకు పోలీసుల నోటీసులు

ఆన్సర్ బుక్‌లెట్లను మార్పిడి చేయించుకున్న విద్యార్థులకు నోటీసులు ఇచ్చి వారికి స్టేషన్ బెయిల్ ఇస్తున్నామని సీఐ సంజీవ మంగళవారం వెల్లడించారు. తమకు కేయూ నుంచి 59 మంది విద్యార్థుల ఆన్సర్‌బుక్ లెట్లు పంపారని సీఐ తెలిపారు.

61మంది విద్యార్థుల ఫలితాలు నిలిపివేత

ఆన్సర్ బుక్‌లెట్లను మార్చుకున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న 61మంది విద్యార్థుల ఫలితాలు నిలుపుదల చేశారు. ఆయా విద్యార్థుల ఫలితాలను విత్‌హెల్డ్‌లో పెట్టినట్లు పరీక్షల నియంత్రణాధికారి నర్సింహాచారి తెలిపారు. పోలీసు అధికారులు ఇచ్చే రిపోర్టును బట్టి ఆయా విద్యార్థులను డీబార్ చేసే అవకాశం ఉంటుందని నర్సింహాచారి పేర్కొన్నారు. అయితే తాము ఇప్పటికే రిపోర్టు ఇచ్చామని, అప్పుడే ఆయా విద్యార్థుల ఫలితాలను నిలుపుదల చేశారని సీఐ అంటున్నారు. కాగా, ఆన్సర్ బుక్‌లెట్ల మార్పిడి ఘటనలో యూనివర్సిటీ అధికారులు 14మంది దినసరికూలీలు, మరో ఆరుగురు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను అప్పట్లోనే విధుల నుంచి తొలగించారు.

కళ్లముందే కొట్టుకుపోయారు..

- నలుగురికి తప్పిన ప్రమాదం.. దొరకని బాలిక ఆచూకీ
- యూపీ హోం మినిస్టర్‌కు కేంద్రమంత్రి బండి సంజయ్ లేఖ
- అయోధ్యకు వెళ్లిన జనగామ వాసులు
- సరయూ నదిలో స్నానం చేస్తుండగా ఘటన


కొట్టుకుపోయే ముందు నదిలో కుటుంబ సభ్యులతో స్నానం చేస్తున్న తేజశ్రీ (వృత్తంలో ఉన్న అమ్మాయి)


దర్శనం తర్వాత చెల్లితో తేజశ్రీ

జనగామ: అప్పటివరకు తల్లిదండ్రుల వెంటే ఉన్న కూతురు 'నాన్నా.. నాన్న' అంటూ కేకలు వేసినా... ప్రవాహంలా వచ్చిన వరద క్షణాల్లో ముంచేసింది. అయోధ్య సరయూ నదిలో జనగామ జిల్లా కేంద్రంలోని ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు కొట్టుకు పోగా... నలుగురు తృటిలో ప్రాణాపాయంనుంచి తప్పించుకున్నారు. బాలిక తేజశ్రీ(17) గల్లంతైంది. ఇంతవరకు ఆచూకీ లభ్యం కాలేదు. బాలిక గల్లంతై రెండు రోజులు గడిచిపోతున్నా... ఆచూకీ లేకపోవడంతో కుటుంబ సభ్యుల్లో ఆందోళన నెలకొంది. సోమవారం ఈ ఘటన జరగగా ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. జనగామ జిల్లా కేంద్రం గీతానగర్‌కు చెందిన తాళ్లపల్లి నాగరాజు, తన ఇద్దరు సోదరుల కుటుంబాలతోపాటు మేనమామ, మేనత్త కలిసి మొత్తం 15 మంది ఈ నెల28వ తేదీన తీర్థయాత్రలకు బయలు దేరారు. హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి విమానంలో ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం అయోధ్య పుణ్యక్షేత్రానికి అదేరోజు సాయంత్రం చేరుకున్నారు. రాత్రి బాలరాముడిని దర్శించుకుని.. 29వ తేదీ (సోమవారం)న కాశీ పుణ్యక్షేత్రానికి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. అంతకుముందు అయోధ్యలోని ఇతర క్షేత్రాలను సందర్శించిన అనంతరం నాగరాజు, ఆయన భార్య జయసుధ, ఇద్దరు కూతుళ్లు తేజశ్రీ, తరుణి, ఇతర కుటుంబ సభ్యులు నది స్నానం కోసం లక్ష్మణ్ ఖిలా ఘాట్ సమీపంలోని సరయూ నదికి చేరుకున్నారు. తల్లి జయసుధ, పెద్ద కూతురు తేజశ్రీ, నాగరాజు తమ్ముడి ఇద్దరు కూతుళ్లు, మరో మహిళ ఐదురుగు నది స్నానం చేసేందుకు సురక్షితమైన ప్రదేశంలోనే నీటిలోకి దిగారు. స్నానం చేసే క్రమంలో ఎగువ ప్రాంతం నుంచి అకస్మాత్తుగా వచ్చిన వరద ఉధృతికి ఐదుగురు కొట్టుకుపోయారు. అక్కడే ఉన్న జాలర్లు వెంటనే స్పందించడంతో నలుగురిని రక్షించగా.. తేజశ్రీ(17) చూస్తుండగానే కొట్టుకుపోయింది. రెండు రోజులుగా గజ ఈతగాళ్లు ఎంత ప్రయత్నిస్తున్నా.. బాలిక ఆచూకీ లభ్యం కాలేదు. తేజశ్రీ జనగామ పట్టణంలోని ఏబీవీ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతోంది.

కేంద్ర హోం సహాయ మంత్రి లేఖ

అయోధ్యలో జనగామకు చెందిన బాలిక గల్లంతుపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి సమాచారం మేరకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పందించారు. బాధిత కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడిన సంజయ్.. కనిపించ కుండాపోయిన తేజశ్రీని ఆచూకీ కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేయాలని ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వానికి లేఖ రాశారు. గాలింపు చర్యలను మరింత ముమ్మరం చేసినట్లు అక్కడి సర్కారు బండి సంజయ్‌కు తెలిపింది.

నాణ్యత, నమ్మకానికి భరోసా భారతి సిమెంట్

- సంస్థ ఉపాధ్యక్షుడు (మార్కెటింగ్) ఎం.సి.మల్లారెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న భారతి సిమెంట్ సంస్థ ఉపాధ్యక్షుడు (మార్కెటింగ్) ఎం.సి.మల్లారెడ్డి

హన్మకొండ: నాణ్యతలో మేటిగా.. ప్రజల నమ్మకానికి భరోసాగా భారతి సిమెంట్ ప్రత్యేక గుర్తింపు సాధించిందని ఆ సంస్థ ఉపాధ్యక్షుడు (మార్కెటింగ్) ఎం.సి.మల్లారెడ్డి తెలిపారు. హనుమకొండ నక్కలగుట్టలోని ఓ హోటల్‌లో మంగళవారం భారతి సిమెంట్ జిల్లా డీలర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశాన్ని సంస్థ ఉపాధ్యక్షుడు (మార్కెటింగ్) ఎం.సీ.మల్లారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతి సిమెంట్ ఉత్పత్తి ప్రారంభించినప్పటి నుంచి వినియోగదారుల నమ్మకాన్ని చూరగొందన్నారు. ప్రజల్లో విశేష ఆదరణ పొందుతోందన్నారు. ఇంజనీర్ లూయిస్ వికాట్ 1817లో సిమెంట్ తయారీని కనిపెట్టారన్నారు. వికాట్ సంస్థ ఆధ్వర్యంలోనే దేశవ్యాప్తంగా 16 సిమెంట్ పరిశ్రమలు, 267 రెడీమిక్స్, 72 కంకర యూనిట్లు నెలకొల్పారని తెలిపారు. ఏడాదికి 50 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తిని కంపెనీ సాధిస్తోందన్నారు. జర్మన్ టెక్నాలజీ, రోబోటిక్ ల్యాబొరేటరీ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భారతి సిమెంట్ ఉత్పత్తి చేస్తున్నామని చెప్పారు. తాపీ మేస్త్రీలకు సంస్థ ద్వారా పర్సనల్ యాక్సిడెంట్ పాలసీ పథకం అమలు చేస్తూ ఆదుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో భారతి సిమెంట్ చీఫ్ మేనేజర్ ఎస్.సతీశ్ రాజు, అసిస్టెంట్ ఉపాధ్యక్షుడు (మార్కెటింగ్) టి.కొండల్ రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ ఏ.వి.జయవర్ధన్ రెడ్డి, డీజీఎం (టెక్నికల్ సర్వీసెస్) సి.ఓబుల్‌రెడ్డి, మేనేజర్ కె.సునీల్ మార్కెటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.